పున్న

పి. వి. రామచంద్రమూర్తిగారు

పదునాఱవ శతాబ్దప్రారంభమున మేవారురాజ్యము రాణాసంగునిచేఁ బాలింపఁబడెను. గుజరతు సుల్తాను చిత్తూరుపై దండెత్తివచ్చెను. ఆ యుద్ధమున రాజపుత్త్రు లెందఱో హతులైరి. చిత్తూరు సుల్తానునకు వశమయ్యెను. మహారాణాపత్నియగు కర్ణావతీదేవి శత్రువునకు జిక్కకుండ పదమూఁడువేల యంతఃపుర కాంతలతోఁ జితిప్రవేశము గావించెను. నాటికిఁ గర్ణావతి కుదయసింహుఁడను శిశువొకఁడుండెను. రాణి యగ్నిఁజొరుటకుఁ బూర్వ మా బాలుని దాదియగు పున్నయను రసపుత్రకాంత నొక్కర్తుఁబిలిచి, "పున్నా! ఈ బాలకుఁడు మేవారుసింహాసనాధిపతి. ఈ పవిత్రమగు భారమును నీపైనుంచుచున్నాను. ఈ నిసుగున కెట్టి ప్రమాదమును రాకుండఁ గాపాడవలెను." అని వచించెను.

పున్ననయనము లశ్రుకణ పూరితములయ్యెను. తన ప్రాణములైనను, తన కత్యంతప్రియులైన వారి యనుజులైనను ధారవోసి యాబాలకుని రక్షించెదనని పున్న కర్ణావతీదేవి హస్తమందుఁ దనహస్తముంచి వాగ్దత్తము చేసెను. కర్ణావతి హృదయమునకు శాంతికలిగినది. రాణి కడసారి శిశువును గౌగలించి నిశ్చలమనస్కురాలై మరణము నెదుర్కొనెను.

ఉదయసింహునకు విక్రమజిత్తను సవతిసోదరుఁడొకఁడు కలఁడు. అతఁడు రాణాసంగుని యనంతరము, అసహాయశూరులును, ప్రభుభక్తికలవారును నగు సామంతులసహాయమున, గుజరతు సుల్తానునుండి మేవారుసింహాసనమును లాగుకొనఁగల్గెను. కాని యాతఁడు సింహాసన మధిష్ఠించిన కొలఁదికాలమునకే కృతఘ్నుఁడై సామంతులలో ముఖ్యుఁడును, గౌరవనీయుఁడునునగు నొక్కని నవమానపఱచెను. ఈ యవమానమును సహింపనోపక, సామంతులెల్ల ఏకమై కుట్రసలిపి, విక్రమజిత్తును జంపి, పృథ్వీరాజసూనుఁడగు బన్బీరను నాతని మేవారుసింహాసనమున నుంచిరి. మేవారురాజ్యము చేఁజిక్కినను, బాలుఁడగు నుదయసింహుఁడు జీవించియున్నంతకాలము, బన్బీరునకు మనమున శాంతికుదురదు. అతఁడు తన్నా సింహాసనమున నిల్పిన సామంతులఁబిలిచి 'రాణాసంగ పుత్త్రుఁడగు నుదయసింహుఁడు సజీవుఁడైయున్నంతవఱకు నాతని సింహాసనాసీనుఁ జేసి స్వలాభమునకై పాటుపడు ప్రజ లెందఱో యుండకపోరు" అని వచించెను.

సామంతు లాతని పల్కులయందలి యదార్థమును గ్రహించిరి. కన్ను తెఱవని యాబాలుని రాజ్యాభిషిక్తుని గావించి, స్వార్థపరాయణుఁడగు బలీయుఁ డొక్కఁడు రాజ్యచక్రముం ద్రిప్పఁబూనుట శ్రేయస్కరముగాదనియు, సమర్థుఁడగు బన్బీరే ఆపరిస్థితులలో మేవారుసింహాసన మధిష్ఠించు టుచితమనియు వారు తలపోసిరి. తుదకు వారందఱును నిరపరాధియగు నాబాలకుని యసువులందీయఁ గృతనిశ్చయులైరి.

విశ్వసనీయయగుపున్న, ఉదయసింహుని గడు భక్తిశ్రద్ధలతోను అతిగారాబముతోను పెంచుచుండెను. పున్న కొకపుత్త్రుఁడు గలఁడు. ఆతఁడును నుదయసింహుఁ డుదయించిన దినముననే జనించెను. వారిద్దఱాడుకొనుచు దినదినప్రవర్ధమానులై పెరుగుచుండిరి.

పున్న ఉదయసింహున కన్నమిడి, శయ్యను బరుండఁజేసి, రాజపుత్త్ర శౌర్యమును జాటు జోలపాటలఁ బాడి నిద్రపుచ్చెను. రాజపుత్త్రుఁడున్న డోలికకుఁ గొంచెము దూరమున గూర్చుండి, ఆమె నిజసుతు నొడియందిడుకొని నిద్రింపఁజేయఁ బ్రయత్నించుచుండెను. అంతట నెద్దియో కలకలము విననయ్యెను. పున్న ఆత్యాతురతతో సుతుని నేలఁ గూర్చుండఁజేసి ఊయెలయందు నిద్రించుచున్న రాజపుత్త్రునొద్దకుఁ బరుగిడెను. తటాలన కవాటము తెఱవఁబడినది. రాజాంతఃపుర సేవకుఁడొకఁడు లోనఁ బ్రవేశించి, 'విక్రమజిత్తు హత్య గావింపఁబడి

వాడ'ను దుర్వార్తనామెకుఁ దెలియఁజేసెను. హంతకుఁ డుదయసింహునిగూడ దెగటార్చినగాని యూరటఁ జెందడని పున్న గ్రహించెను. ఆ తలపామెను భయకంపితగాఁజేసెను. 'రాకొమరుని భద్రముగ దాచవలెను' అని పున్న నెమ్మదిగాఁ బలికెను. 'ఎట్లు? ఎటుచూచినను శత్త్రువులే. నగరమున నొక్కఁడైనను విశ్వసనీయుఁడు కానరాఁడు' అని యాభృత్యుఁ డాతురతను దెలియఁజేసెను. పున్న 'నాకొక యుపాయము దోచుచున్నది' అనియెను. దానికై యాతఁ డెదురు చూచుచుండెను. ఆమెవదనము తెల్లబాఱినది. ఆమె కన్నీటిబిందువుల రాల్చుచు తన యనుంగు తనయుని యొద్దకుఁబోయి మోకాళ్లపై నిలువఁబడి 'బంగరుతండ్రీ, నీవు రాజపుత్త్రునివేషము ధరింపుము. చూడుము. ఈ యుష్ణీష మెంత యందముగ నున్నదో! దీనిఁ బెట్టుకొనుము. ఆ ముత్తియముల మొలత్రాటిని గాంచుము, తళతళ నెట్లు మెఱయుచున్నదో! దాని నలంకరించుకొనుము. రాజపుత్త్రుని హంసతూలికాతల్పమున నిదిరించుచు మేవారుదేశపు ప్రభువవైనట్లు కలగాంచు'మని లేని నవ్వును దెచ్చుకొనుచుఁ బలుకసాగెను. ఆ డింభకుఁడును రాణావలె నటించుటకుఁ దన సంభ్రమమును దెలియఁజేసెను. రత్నఖచితమగు నాయుష్ణీష మా బాలకుని మూర్ధమున నుంపఁబడినది. పున్న రాజపుత్త్రుని మౌక్తికమేఖలనుగూడ యాబాలునినడుమునకుఁ దగిల్చినది. అప్పు డా బుడుతఁడు కౌతుకమును దెలియజేయుచు 'అమ్మా, నేను రాణానైనట్లు కలగాంచి నిద్రనుండి మేల్కొన్న యనంతరముగూడ రాణానైయుందునా?' అని యడిగెను. 'తండ్రీ! ప్రభుభక్తియుతుఁడగు రాజపుత్త్రుడు మేల్కొంచువిధమున లేతు'వని పున్న ప్రత్యుత్తరమిచ్చెను.

పిమ్మట పున్న యుదయసింహుని యూయెల యొద్దకుఁబోయి యాబాలుని లేపెను. "నాయనా! నీవిప్పు డొకచోటికిఁ బోవలయును. అచ్చట చిత్రవిచిత్రములగు దృశ్యముల నెన్నిటినో కాంచగలవు!" అని యామె రాకొమరునకుఁ జెప్పినది. 'నామిత్త్రుఁడుకూడ నాతో నేగుదెంచునా?' అని యాతఁ డడిగెను. 'స్వామీ! ఆతఁడు రాఁడు. నీవింటలేని సమయమున నీరాజ్యమును గాచుచు ఇచటనే నిలిచి పోవును.' అని పున్న ప్రత్యుత్తరమిచ్చెను. ఉదయసింహుఁడును మాఱుమాటాడలేదు.

పున్న తన్నింటవిడచి రాజపుత్త్రు నెటకో తీసికొనిపోవుచున్నదని విన్నపు డామె పుత్త్రు డేడువసాగెను. 'నన్నొంటరిగ విడిచిపోవలదు. నన్నుగూడ కొనిపొమ్మ.' అని యాతఁడు తల్లిని బ్రార్థింపసాగెను. 'రాజపుత్త్ర వీరుఁడవగు నీకిట్టి భీరుత్వముకూడదు. నేను తిరిగి వచ్చువరకును మాటలాడక పరుండు'మని బిగ్గరగాఁబల్కి, ఉదయసింహుని సెజ్జయందు వాని నుంచి, రాణానిమిత్తమైపోరి వీరస్వర్గముంజెంది రాణాఋణమును దీర్చుకొన్న రాజపుత్త్రులగూర్చి పాడుచుఁ బున్న కొమరుని నిద్రపుచ్చెను.

ఆ పాపఁడు కన్నులమూయుటతోనే, జననియొక్కయా ముద్దులొలుకువదనముపై దృష్టి సారించినది. ఆ వీక్షణమునఁ బ్రేమయు, దుఃఖమును మిళితములై కన్పడుచున్నవి. మఱుక్షణమున మానసమును జిక్కఁబట్టుకొని లేచినది. ఆమె చిన్నిరాకొమరుని జంకనిడుకొని, సేవకుఁడు వెంటరాఁగా నొక రహస్యమార్గమున నాగదిని విడిచిపోయెను.

వారట్లా రహస్యమార్గముంబట్టిపోయి, ఒక నిర్జనప్రదేశమునుజేరిరి. ఆమె వెతకి యొక పూలజంగెడను దెచ్చి, యం దుదయసింహుని బరుండఁబెట్టి 'కదలవల'దని చెప్పెను. పిమ్మట నాజంగెడ పైభాగమును బూలతోను నాకులతోను నింపినది. పున్న, కూడ వచ్చిన పరిచారకునితో నాజంగెడమగొని దుర్గమావలకుబోయి తనకై వేచియుండుమనిచెప్పి పంపివైచెను.

పున్న యొంటరిగ నంతఃపురప్రాసాదమున కేతెంచెను. ఆమె సుతుఁడు గాఢమగు నిద్రయందుండెను. పున్న శయ్యాప్రక్కను గూర్చుండియున్నది. కొన్ని నిముసములు గడచినవి. తలుపు తెఱవఁబడినది. ఖడ్గ

హస్తుఁడై, భీకర స్వరూపుఁడగుబన్బీరు ద్వారమున దృశ్యుఁడయ్యెను. 'ఉదయసింహుఁ డెచ్చట?' అని యాతఁడు గర్జించి యడిగెను. పున్నమేను చెమర్చినది. ఉబికివచ్చుచున్న దుఃఖ మామె కంఠమును స్తంభింప, నామె మాటలాడ నేరదయ్యెను. ఆ క్రూర హృదయుని ప్రశ్న కుత్తరముగ నామె శయ్యపై నిదురించు తనసుతుని జూపెను. బన్బీ రతిరయమున నా పాన్పునొద్దకుఁబోయి, మేనువంచి, యాబాలకుని బరికించిచూచెను. ఉదయసింహుని దుస్తుల దొడగికొని నిశ్చింతతో నిదురించు బాలకునింగాంచి యెట్టి యనుమానమునకును లోనుగాక వాఁడే రాణాసంగ పుత్త్రుఁడని భావించి, ఆ కటికివానిసి నిరపరాధి యగు నాచిన్నిపాఁపని వక్షమున బాకునుగ్రుచ్చి త్వరితగమనమున నావలకుఁబోయెను. పాప మా ఘోరకృత్యమును పున్న కన్నులారగాంచి కెవ్వుమని యఱచుచు నేలకొరిగిపోయెను. దుర్భర పుత్త్రశోక మొక్కసారిగా నామె నావహించినది. ఆమె యాక్రందనమును విని చుట్టుప్రక్కలగల స్త్రీలెల్ల నాగది కేగుదెంచి, మేవాడుసింహాసనాధిపతి ఉదయసింహుఁడుగూడ హత్య గావింపఁబడెనని గ్రహించి, విలపింపసాగిరి.

పారములేని దుఃఖసముద్రమున గ్రుంకులిడుచు పున్న తనూజుని మృతకళేబరమునకు దహనక్రియలు గావించినది. ఆమె యశ్రుకణములాచితియందలి భస్మమును పవిత్రముగఁ జేసినవి. ఇంక నామె జాగుసేయుటుచితముగాదు. అతిశీఘ్రముగబోయి, కోటవెలుపల తనకై వేచియుండు సేవకుని గలసికొని, ఉదయసింహుని భద్రమగు ప్రదేశమునకుఁ గొంపోవలయును.

కోటయావల నదీప్రాంతమున నొక యిసుకతిన్నెపైఁ బత్త్రభారమును వహించియున్న పూలజంగెడను మఱుగుపఱచి, ఆ సేవకుఁడు పున్నకొఱకెదురు చూచుచుండెను. ఆమె యేగుదెంచిన యనంతరము వారిద్దఱా జంగెడనుగొని దేవళనగరమార్గమును బట్టిపోయిరి. దేవళనగరమును బాలించురాజు సింగుబాహుఁడనువాఁడు. పున్న యాతని సమీపించి, ఉదయసింహునిజూపి, యాతనికి శరణమిమ్మనికోరెను. బన్బీరున కీ రహస్యము దెలిసినచో నా బలీయునితోఁ బ్రబలవిరోధము దెచ్చుకొనవలసివచ్చుననియు, అందువలన ప్రమాదము వాటిల్లుననియు భయపడి సింగుబాహుఁడు పున్న ప్రార్థన కియ్యకొనఁడయ్యెను. పాపము పున్న రక్షకునకొఱకై తిరుగఁజొచ్చినది. విశ్వసనీయుఁడగు నా సేవకుఁడు దక్క నామెకు సహాయు లెవరును లేరు. వారనంతరము డోఁజైరుపురమునకు బయనమై పోయిరి. అచ్చటి నాయకుఁడును ఆ రాజపుత్త్రుని గైకొనుటకు సాహసింపఁడయ్యెను. పున్న కాందోళన హెచ్చగుచుండెను. వారి కాహారముగాని నిద్రగాని పూర్తిగా లభింపదయ్యెను. కాని పున్న మాత్రము వెనుదీయలేదు. ఆమె కడుసాహసి. ధైర్యవతి. రాజభక్తి యామెను ముందంజవేయించుచున్నది. భగవంతుని కటాక్షమునం దామెకు సంపూర్ణ విశ్వాసముకలదు.

ఆమె చుట్టుదారి నొకదానిగైకొని ఈడరుద్వారా ఆ రావళీచటేరియలఁజేరెను. అవన్నియు బాటలులేని సాంద్రారణ్యములు. దినమంతయు వారు మార్తాండుని వాఁడి మయూఖములకు గుఱియై, రాత్రియంతయు శీతలముచే బాధపడఁజొచ్చిరి. కాని పున్న యచట గల భిల్లులతోఁ బరిచయము గావించుకొని వారి సహాయమువలన కొమల్మరును జేరఁగలిగెను.

ఆ సాహా యను జైనుఁడొక్కఁ డా ప్రాంతమునఁ బాలించుచుండెను. ఆతనియొద్దకు పున్నపోయి, ఉదయసింహు నాతని హస్తములందుంచి, 'ఈతఁడు మీ ప్రభువు. మేవాడుసింహాసన మీతనిదే. కాన నీతని నప్రమత్తుఁడవై గాచికొనుము.' అని పలికెను. ఆ సాహా భయాశ్చర్యములకు లోనయ్యెను. 'బన్బీరును సింహాసనమునను౦చిన సామంతు లెల్లఱును బలవంతులు. ఉదయసింహుఁడు నా గృహమందుండెనని వారికి దెలియవచ్చినచో వారి యాగ్రహమునకు గుఱియగుదు'నని యాసాహా సందేహింపఁజొచ్చెను. ఆసాహాజనని యాపలుకుల నాలకించినది. 'ప్రభువిశ్వాసముగలవారి కిట్టి యాపద లొక లెక్కలోనివి గావు. ఎందుల కా భయము? ఆ బాలుఁడు, మహనీయుఁడగు రాణాసంగుని పుత్త్రుఁడు. రాణాసంగుఁడు నీ యజమాని. ఆపదనున్న యీపిల్లవాని నిప్పుడు

చేకొని నీ రాజభక్తిని వెల్లడిఁజేయుము.' అని యామె కుమారుని హెచ్చరించెను. ఆ ధీరవాక్యము లాతని భయమును బాఱఁదోలినవి. ఆ బాలుని రక్షింప నాతఁడు బూనుకొనెను. అన్యుల కెట్టి యనుమానమును గలుగకుండ నా బాలుఁడు తన మేనల్లుఁడని యాసాహ చెప్పఁదొడఁగెను.

పున్న భారమిప్పుడు తగ్గినది. తనవిధి నామె నెఱవేర్చుకొన్నది. రాజతనయుని ప్రాణముల గాపాడ, నిజసుతుని యమునకుల నర్పించి మహాత్యాగమును జూపినది. యుదయుని యొద్దనైనను తన జీవితశేషమును గడుప నామె నోచుకొనలేదు. కైనవాయకునిగృహమున నొకరాజపుత్రవనిత వసించియుండు టనుమానమునకు హేతువగును. అందువలన ఆ సాహ మేనల్లునివలెఁ బెరుగుచున్న మేవాడురాణాకుఁ బ్రమాదము వాటిల్లవచ్చును. అట్టి సందర్భమున నామెజూపిన మహాత్యాగమును బడినశ్రమయు నిరర్థకములగును. అందుచేఁ బున్న ఉదయసింహుని వీడి చిత్తూరునకుఁ దిరిగివచ్చెను. ఉదయసింహుఁడు పెరిగి పెద్దవాఁడై సింహాసన మధిష్ఠించు తరుణమునకై యామె చిత్తూరునం దెదురు చూచుచుండెను.

తుదకా తరుణ మేగుదెంచినది. ఆమె మనోరథ మీడేరినది. బన్బీర క్రమముగాఁ బాలింపదొడఁగెను. సామంతులెల్లరు 'కొఱవిదెచ్చి తల గోకికొంటి' మని పశ్చాత్తాపపడఁబొచ్చిరి. వారందరును బన్బీరును పారదోలి రాణాసంగుని వారసు నొక్కనిదెచ్చి సింహాసనమునఁ బ్రతిష్ఠించిరి. నాటికి చరమదశయందున్న పున్న ఉదయసింహునిఁ దెచ్చి, యాతఁడు గతించలేదనియుఁ జిత్తూరుసింహాసనమునందుఁ బరిపూర్ణమగు హక్కతనికిఁగలదనియు నిరూపించెను.

పున్న పూతచరిత్ర. మహాత్యాగవతి. ఆమె చితిపై నున్నతమగు చలువరాతి కట్టడమొకటి నిర్మింపఁబడినది. అనుపమానమగు శిల్పవిద్యాకౌశల మందుఁ జూపఁబడినది. ఆమెపైగల గౌరవముచే స్మృతిచిహ్నముగ నా కట్టడమును రాణా ఉదయసింహుఁడు కట్టించెను. ఆకట్టడ మామె యద్వితీయమగు రాజభక్తిని ప్రపంచమునకుఁ జాటిచెప్పుచు నామెను మృతజీవినిగ జేసినది.

* * * *

పన్నా

హరి రాధాకృష్ణమూర్తి గారు

పన్నా సంగ్రామసింహుని దేవేరియరణపుదాసి. మేవాడ్ రాజ్య సంరక్షకుఁడు వనవీరుఁడు రాజవంశము నిర్మూలింపఁజూడవచ్చునని వినినది. కన్నపుత్రుని యుదయసింహునిగామార్చి శయ్యనిడి వాపోవుచున్నది.

ఉదయాధీశుని పంచవర్షముల నాయుష్కముఁ గాలుష్యపుం
బథముం బూని వధింపవచ్చునట ! యావజ్జీవముందానె రా
ట్పదవింబొందగ రాజ్యరక్షకుఁడు; దుర్వ్యాపారమాదీననా
యుదయుంగావగ నీదుపాలఁబడె బాబూ, యెట్లుగాపాడెదో !
కన్నులనైనవిప్పి ననుఁగాననివాఁడవైయైన నీకు నే
నన్నిసపర్యలం బ్రియమునందగఁ జేయకయున్నఁ దల్లినై
చిన్నినిసుంగువైన నినుఁజేరిచి పెంచకయున్న నిట్టులో
యన్న, త్వదీయ మాతృఋణమంతయుఁ దీర్పుమటందులోభినై ॥
భూతమయంబునై బ్రతుకుపొందుటకైన శరీరమిద్ది యే
భూతలనాథు నుప్పుదిని పూర్ణమనోరథమయ్యె నట్టివి
ఖ్యాతచరిత్రు నన్వయ నవాంకుర మొక్కమదద్విపంబు దా
నీరిసడల్చి మ్రింగ గమనింపగ నూరకయుంట పాడియే !